ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి


గోపాల్‌పేట ఆదర్శ కళాశాలలో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

దోమకొండ : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నుంచి జరుగనున్న ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ జైపాల్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఇక్కడి ప్రభుత్వ కళాశాలలో మొత్తం 458 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు వివరించారు. మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల కళాశాల, సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల, దోమకొండ, బీబీపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. ఈనెల 28నుంచి మార్చ్ 14వ తేదీ వరకు పరీక్షలు ఉంటాయన్నారు. 15,16 తేదీల్లో బ్రిడ్జి కోర్సు వారికి పరీక్షలు ఉంటాయన్నారు. దోమకొండ పరీక్ష కేంద్రానికి డిపార్ట్‌మెంటల్ అధికారిగా గాంధారి నుంచి రమేష్ వచ్చినట్లు పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు ఉంటాయని విద్యార్థులు ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రానికి అనుమతి ఉండదని ఆయన వివరించారు.

లింగంపేట(ఎల్లారెడ్డి): ఇంటర్ పరీక్షలకు ఏర్పాటు పూర్తి చేసినట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్ తెలిపారు. మంగళవారం కళాశాలలో ఇన్విజిలేటర్లతో సమావేశం నిర్వహించారు. ఉదయం 8 గంటలకే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. డిపార్టుమెంటల్ అధికారి సాయిలు, ఇన్విజిలేటర్లు, సిబ్బంది ఉన్నారు.

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : ఇంటర్ పరీక్షల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా నాగిరెడ్డిపేట మండలంలోని గోపాల్‌పేట ఆదర్శ కళాశాలలో ఇంటర్ పరీక్షాకేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మండలంలోని ఆదర్శ కళాశాలతోపాటు సిద్ధార్థ కళాశాల విద్యార్థులు బుధవారం నుండి ప్రారంభమయ్యే ఇంటర్ పరీక్షలకు హాజరు కానున్నారు. ఈ పరీక్షలకు చీఫ్ సూపరింటెండెంట్‌గా నర్సింహాచారి, డీవోగా నాగయ్య వ్యవహరించనున్నారు.

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలలో ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తిచేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలికల గురుకుల పాఠశాల, లింగంపేట్ గురుకుల పాఠశాలకు చెందిన 228 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారు. చీఫ్ సూపరింటెండెంట్లుగా యూసూఫ్ హుస్సేన్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లుగా నాగేశ్వర్ బాబు వ్యవహరించనున్నారు.

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డి : ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రభుత్వ జూనియ ర్ కళాశాల, మోడల్ కళాశాల ప్రిన్సిపాళ్లు హేమచందర్, సాయిబాబాలు మంగళవారం తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.


లింగంపేటలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నరేందర్

మద్నూర్‌లో..

మద్నూర్(జుక్కల్) : మండల కేంద్రంలోని రాంసుఖ్ బాల్‌ముకుంద్ ఇనాని ప్రభుత్వ ఇంటర్ కళాశాల, మేనూర్‌లోని మోడల్ కళాశాలలో బుధవారం నుండి ప్రారంభమయ్యే పరీక్షలకు అన్ని ఏర్పాటు పూర్తి చేసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ గంగాధర్ తెలిపారు.


కామారెడ్డి జిల్లా కేంద్రంలో..


ఎల్లారెడ్డిలో..

ఆటో డ్రైవర్లు ఏకం కావాలి


ఆటో డ్రైవర్లకు గుర్తింపు కార్డులను అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

కామారెడ్డి అర్బన్ : ఆటోడ్రైవర్లు ఏకమై ఆటో యూనియన్ల జేఏసీతో కలిసి ఉద్యమించాలని ఆటో జేఏసీ జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు బి నర్సింలు అన్నారు. సోమవారం కామారెడ్డి సీఎస్ఐ చర్చి మైదానంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆటో డ్రైవర్లకు జేఏసీ గుర్తింపుకార్డులను అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు నర్సింలు మాట్లాడుతు..ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆదాయం తగ్గినందున డ్రైవర్లు ఏకమై ప్రభుత్వానికి తెలిసేవిధంగా ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఎస్‌కే.హైమద్, ప్రధాన కార్యదర్శి షిండేరాములు, ప్రతినిధులు సిద్దిరాములు, మహేందర్, సాయిలు, రమేష్, సాయి సంతోష్, అనిల్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



బిచ్కుందలోని మానేపూర్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు, గజ్యానాయక్ తండాలో..

నియోజకవర్గాల్లోని ఆయా ప్రాంతాల్లో సీసీ రోడ్డు పనులను మంగళవారం పలువురు నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్


కంచర్లలో..


మహమ్మద్‌నగర్‌లో..

కాంగ్రెస్‌తోనే సంక్షేమం

భిక్కనూరు : మండలంలోని కాంగ్రెస్ పార్టీతోనే సంక్షేమం సాధ్యమవుతుందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పేర్కొన్నారు. లక్ష్మీదేవునిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నేతలు పలువురు మంగళవారం ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ సమక్షంలో కాంగ్రెస్‌పార్టీలో చేరారు. బీఆర్ఎస్ నేతలు హేమేందర్‌రెడ్డి, మైపాల్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డిలతో పాటు మరో 27 మంది కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు ఎన్నం శ్రీనివాస్‌రెడ్డి, లింగారెడ్డి, మల్లారెడ్డి, బాబు, నర్సింలు పాల్గొన్నారు.


షబ్బీర్‌అలీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న లక్ష్మీదేవునిపల్లి బీఆర్ఎస్ నేతలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి సింగిల్ విండో చైర్మన్ మర్రి సదాశివరెడ్డితో పాటు సీనియర్ నాయకుడు ఆకుల సిద్దిరాములు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు వారికి పార్టీ కండువాను కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ మండల కోఆప్షన్ ఇర్షాదొద్దీన్, విండో డైరెక్టర్లు బత్తులరాములు, భాస్కర్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి : మండలంలోని పలు పార్టీల నాయకులు మంగళవారం ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎల్లారెడ్డి సొసైటీ డైరెక్టర్ సుఖేందర్‌రెడ్డి, బీజేపీ ఐటీసెల్ నాయకులు రవి, బీఆర్ఎస్ పార్టీకి చెందిన మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ముజీబ్‌లు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చెన్న లక్ష్మణ్, అజర్ తదితరులున్నారు.



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న విండో చైర్మన్ సదాశివరెడ్డి, సొసైటీ డైరెక్టర్ సుఖేందర్‌రెడ్డి తదితరులు

పదో తరగతి కీలకమైనది..



మాచారెడ్డి : విద్యార్థులకు పదో తరగతి కీలమైనదని పరీక్షలను ధైర్యంగా ఎదుర్కోవాలని డీఎస్పీ నాగేశ్వరరావు సూచించారు. మంగళవారం మండలంలోని సోమారంపేటలో ఉన్నత పాఠశాలను సందర్శించి పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. మాచారెడ్డి పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ముందుగా మండలంలో నమోదైన ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసుపై ఆయన విచారణ జరిపారు. సంఘటనా స్థలాన్ని సందర్శించి బాధితులతో మాట్లాడారు. మాచారెడ్డి ఎస్సై శ్రీనివాస్ గౌడ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డి మండలంలోని అడివిలింగాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నాగిరెడ్డిపేటకు చెందిన కానిస్టేబుల్ శివయ్య మంగళవారం పరీక్ష ప్యాడ్‌లను పంపిణీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం శివ నర్సింహారావు, టీచర్లు విజయ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండుగ

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలో మంగళవారం రాత్రి రేణుకా ఎల్లమ్మ బోనాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గౌడ సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి బోనాలు ఊరేగింపు తీశారు. గడపగడప నుంచి బోనాలు, సైపై ద్యాలతో ఆడపడుచులు ఆటా, పాటలు, బ్యాండ్‌తో శివసత్తుల పూనకాలతో అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా తరలివచ్చారు. అమ్మవారి ఆలయం వద్ద బోనాలతో మొక్కులు చెల్లించుకున్నారు.

'ప్రజల ఆప్యాయతను మరువలేను'



కామారెడ్డి అర్బన్ : ప్రభుత్వ వైద్యుడిగా ఏళ్ల పాటు కామారెడ్డి ప్రాంతానికి సేవలు అందించానని, ప్రజల ఆప్యాయతను మరువలేనని సీనియర్ వైద్యుడు కే.రాజగోపాల్ అన్నారు. సోమవారం రోటరీయన్ రాజగోపాల్, విశ్రాంత ఉపాధ్యాయుడు నర్సింహారెడ్డిని రోటరీ ఆధ్వర్యంలో సన్మానించారు. రోటరీ అధ్యక్షుడు పోలబోయిన సత్యం, సీనియర్ రోటరీయన్లు సుభాష్‌చంద్, డాక్టర్ బాలరాజు, జి.ధనుంజయ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

మాచారెడ్డి : మండలంలోని చుక్కాపూర్ లక్ష్మి నృసింహస్వామి ఆలయ అభివృద్ధి కోసం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన ఇంద్రాల ముత్యం రావు రు.లక్షా 50వేలు ఇస్తానని ఒప్పుకొని ముందుగా రు. 50 వేలు మంగళవారం ఆలయ సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు దాతకు స్వామి వారి చిత్ర పటాన్ని బహూకరించి సత్కరించారు.



ఆధ్యాత్మికం

నేడు సహస్ర ఘటాభిషేకం

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని ఉత్తునూర్ గ్రామంలో శ్రీ ఖండేరాయ ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా బుధవారం సహస్ర ఘటాభిషేకం, బోనాల ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ దొడ్లె రవి తెలిపారు. మంగళవారం ఉత్తునూర్‌లో మంగళవారం శ్రీ ఖండేరాయ ఆలయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మంటప పూజ, హోమం నిర్వహించారు. ఆలయ కమిటీ, వీడీసీ చైర్మన్ దొడ్లె రవి, గ్రామాభివృద్ధి కమిటీ ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద కుంకుమార్చన



నిజాంసాగర్ (జుక్కల్) : మహమ్మద్‌నగర్ మండల కేంద్రం శివారులోని రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కుంకుమార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం, బోనాల ప్రదర్శన ఉత్సవాలను ప్రతీఏటా జరుపుతున్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు మోతె.రామాగౌడ్, గంగాగౌడ్, రాజాగౌడ్, విఠల్‌గౌడ్, రవీందర్ గౌడ్ తదితరులున్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ కల్యాణం



భిక్కనూరు : మండల కేంద్రంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయం 48 వార్షికోత్సవ ఉత్సవలు ఘనంగా సాగుతున్నాయి. మంగళవారం గౌడ్ సంఘం ఆధ్వర్యంలో రేణుకా ఎల్లమ్మ-జమదగ్నిల కల్యాణాన్ని ఘనంగా జరిపించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని భక్తులతో పాటు రామాయంపేట, దోమకొండ, కామారెడ్డి ప్రాంతాలకు చెందిన భక్తులు కల్యాణంలో పాల్గొన్నారు.

ఘనంగా నేక్‌బీబీ దర్గా ఉర్సు



బాన్సువాడ రూరల్ : మండల కేంద్రంలోని నేక్‌బీబీ దర్గా ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి దర్గాను అలంకరించారు. కుల, మతాలకు అతీతంగా భక్తులు తరలివచ్చి నేక్‌బీబీ దర్గా వద్ద మొక్కులు చెల్లించుకున్నారు.ఇస్లాంపూర, సంగమేశ్వర కాలనీ, పీఎస్ఆర్ డబుల్‌బెడ్‌రూం కాలనీల నుంచి ఊరేగింపు నిర్వహించారు.

విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు..


చిన్నమల్లారెడ్డి బాయ్స్ హైస్కూల్‌లో బదిలీపై వెళ్తున్న టీచర్లను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు


గర్గుల్‌లో మాట్లాడుతున్న డాక్టర్ రమణ


రాజంపేటలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందిస్తూ..

కామారెడ్డి టౌన్ : పరీక్షల కాలంలో విద్యార్థులు ఒత్తిడికి గురికావద్దని ప్రభుత్వ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ జి. రమణ విద్యార్థులకు సూచించారు. జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం ఆధ్వర్యంలో మండలంలోని గర్గుల్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం, కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లా మానసిక ఆరోగ్య సామాజిక కార్యకర్త రాహుల్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు మానసిక సమస్యలుంటే 14416లో సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వీరబ్రహ్మం ఉపాధ్యాయులు దయానంద్ తదితరులున్నారు.

కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో..

కామారెడ్డి అర్బన్ : విద్యార్థులు ఉన్నతమైన ఆలోచన విధానంతో శాస్త్రీయ విద్య, ప్రాధాన్యతను గుర్తించాలని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కే.విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవ కార్యక్రమం నిర్వహించి విద్యార్థులకు వివిధ శాస్త్రీయ అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, సమన్వయకర్త పి.రామకృష్ణ, మల్సూర్, తిరుమల, శంకర్‌లు మాట్లాడారు. విద్యార్థులు వివిధ రకాల అంశాలపై చేసిన ప్రజెంటేషన్‌లను పరిశీలించడానికి న్యాయనిర్ణేతలుగా రాజ్‌గంభీర్ రావు, ఫర్హీన్‌ఫాతిమా వ్యవహరించారు.

చిన్నమల్లారెడ్డిలో..

కామారెడ్డి రూరల్ : ఉత్తమ సేవలతోనే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని ప్రధానోపాధ్యాయుడు సాయిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చిన్నమల్లారెడ్డి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోసానిపేటకు బదిలీపై వెళ్తున్న పీజీహెచ్‌ఎం శ్రీనివాస్, లచ్చపేటకు బదిలీపై వెళ్తున్న ఎస్‌ఏ మ్యాథ్స్ శ్రీనివాస్‌లకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ప్రతాపరెడ్డి, రాజ్యలక్ష్మి, సుశీల, ఉమాదేవి, బుచ్చిరెడ్డి, ప్రభాకర్ తదితరులున్నారు.

రాజంపేట మండలంలో..

రాజంపేట : పదో తరగతి విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో రాబోయే పరీక్షలకు సన్నద్ధం కావాలని గుండారం ఎంపీటీసీ హాజీనాయక్, నడిమితండా మాజి సర్పంచ్ వినోద్ కుమార్ అన్నారు. మంగళవారం గుండారం, ఆర్గోండ, బస్వన్నపల్లి హైస్కూల్‌లో విద్యార్థులకు హెల్పింగ్ బ్రిడ్జ్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఎగ్జామ్ ప్యాడ్లను అందజేశారు. హెల్పింగ్ బ్రిడ్జి ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ప్రతినిధులు కృష్ణాకర్ రావు, తోట సాయిలు, ఎస్‌ఎంసీ చైర్మన్ శ్యామయ్య తదితరులున్నారు.

క్లుప్తంగా

రుణాలను సకాలంలో చెల్లించాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : బ్యాంక్ లింకేజీ రుణాలను సకాలంలో చెల్లించాలని ఏపీఎం రాజిరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సమాఖ్య సమావేశం నిర్వహించారు. స్త్రీనిధి రుణాలను సంఘాలకు ఇప్పించాలన్నారు. విద్యార్థుల యూనిఫామ్స్ కుట్టడానికి గ్రామ సంఘాల వారిగా గ్రామాల్లో టైలరింగ్ చేస్తున్న వారి పేర్లను పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు శోభ, ఏపీడీ మురళి, డీపీఎంలు రవీందర్, వకుల, సురేశ్ కుమార్, సీసీలు తదితరులున్నారు.

'మాదక ద్రవ్యాల జోలికి వెళ్లొద్దు'



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మాదక ద్రవ్యాల జోలికి వెళ్లొద్దని ఐఎస్ఆర్‌డీ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి అమృత్ రాజేందర్ రావు అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మానవ అక్రమ రవాణ, సామాజిక మాధ్యమాల వల్ల ఎదురవుతున్న సమస్యలపై మాట్లాడారు. యువత, ప్రజలు సైబర్ నేరాలకు బలైపోతున్న తీరుపై వివరించారు. తమ పిల్లలను చెడు వ్యసనాలకు బలికాకుండా చూసుకోవల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక పర్యవేక్షణ పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం రాజిరెడ్డి, మండల సమాఖ్య అధ్యక్షురాలు శోభ, సంస్థ ప్రతినిధులు విఠల్ రావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : తాడ్వాయి మండల కేంద్రంలో మంగళవారం తాడ్వాయి మండల ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కృష్ణచైతన్యగౌడ్, ఉపాధ్యక్షులుగా మల్లేష్, సునీల్, ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్‌రెడ్డి, కార్యదర్శిగా రాజుకుమార్, కోశాధికారిగా మురళి, సలహాదారులుగా నవీన్‌రావు, సాయిబాబా, నరేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో కలసిమెలిసి పనిచేసి రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని జహీరాబాద్ పార్లమెంట్ కంటెస్టెడ్, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బానాల లక్ష్మారెడ్డి అన్నారు. తాడ్వాయి మండల కేంద్రంలో మంగళవారం విజయ సంకల్ప యాత్రను ఉద్దేశించి నిర్వహించిన సన్నాహక సమావేశంలో మాట్లాడారు. కేంద్రం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. మార్చి 1 నుంచి ఎల్లారెడ్డి అసెంబ్లీలో జరిగే విజయయాత్రను సక్సెస్ చేయాలన్నారు. సమావేశంలో యాత్ర ప్రభారీ నరేందర్‌రెడ్డి, మండల నాయకులు పాల్గొన్నారు.

మొక్కలు ఎండిపోకుండా చూడాలి



రాజంపేట : గ్రామాల్లోని నర్సరీలలో మొక్కలు ఎండిపోకుండా చూడాలని మండల ఎంపీడీవో కె రాజేశం అన్నారు. మంగళవారం రాజంపేట మండలంలో షేర్‌శంకర్‌తండా, ఎల్లారెడ్డిపల్లి తండాల్లో ఉపాధి హామీ పనులను, నర్సరీలను సందర్శించారు. నర్సరీల్లో వందశాతం మొక్కలు పెరిగే విధంగా చూడాలని సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. కార్యక్రమంలో టీఏలు, జీపీఎస్‌లు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని లింగంపల్లి(ఖుర్దు)లో కొనసాగుతున్న మైనార్టీ గురుకుల పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేసినట్లు ప్రిన్సిపాల్ వెంకట్రాములు తెలిపారు. అనీమియా ముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా సీజనల్‌గా వచ్చే దగ్గు, జలుబుతో బాధపడకుంగా ఉండడానికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు క్రాంతికుమార్, నిక్కత్, ఫర్మాసిస్టు ఉమారాణి, ఏఎన్ఎం స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

ముమ్మరంగా చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా సాగుతుంది. ఆదివారం నాటికి 3లక్షల 16వేల 291 మెట్రిక్ టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావ్ తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నామని పేర్కొన్నారు.

ఉత్సాహంగా వీడ్కోలు సమావేశం

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థులు వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉల్లాసంగా...ఉత్సాహంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం గోవర్దన్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

రాజంపేట : మండల కేంద్రంలోని స్థానిక రైతువేదిక భవనంలో నేడు (బుధవారం) ఎంపీపీ లింగాల వరూప అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు మండల ఎంపీడీవో కె రాజేశం మంగళవారం పత్రికా ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆహ్వానితులు సకాలంలో హాజరై సమావేశాన్ని విజయవంత చేయాలని ఆయన కోరారు.

యూరియాను అధికంగా వాడొద్దు

గాంధారి(ఎల్లారెడ్డి) : రైతులు యాసంగిలో సాగు చేసిన పంటలకు యూరియాను అధికంగా వాడొద్దని ఏవో నరేశ్ సూచించారు.మంగళవారం ఆయన రాంలక్ష్మణ్ పల్లి శివారులో వరి పంటను పరిశీలించారు. ఆయన వెంట రైతులు, ఏఈవో తదితరులు ఉన్నారు.

బాధితులకు పరామర్శ

బాన్సువాడ రూరల్ : అధైర్య పడొద్దని తాను అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్‌పార్టీ బాన్సువాడ నియోజకవర్గం ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బోర్లం గ్రామానికి చెందిన సంగం సత్యనారాయణరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎంపీటీసీ శ్రావణి దేవేందర్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్ గొబ్బురు రాణీ జనార్ధన్‌రెడ్డి, నాయకులు సతీష్‌గౌడ్, మంద సాయిలు తదితరులున్నారు.

ఆర్థికసాయం..

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : మండలంలోని జాన్కంపల్లి గ్రామానికి చెందిన బుక్యా నాయక్‌కు సంబంధించిన నివాసపు గుడిసె కాలిపోవడంతో బాధితుడికి లింగంపేట మండలంలోని గాంధీనగర్‌కు చెందిన భీరాంవు దుస్తులు, బియ్యం ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రవీందర్ తదితరులున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



ఎల్లారెడ్డి : పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను సెక్టార్ ఆఫీసర్, ఆర్ అండ్‌బీ డీఈ నారాయణ మంగళవారం పరిశీలించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌వో తదితరులున్నారు.